సాక్షి నంద్యాల

బుధవారం ׀ 4 ׀ డిసెంబర్ ׀ 2024



ముడుపులు ఇచ్చుకోవాల్సిందే!

జిల్లా వ్యవసాయ కార్యాలయం కమీషన్ల మత్తులో జోగుతోంది. వివిధ కార్యక్రమాలకు బిల్లులు విడుదలైతే చాలు 50 శాతం వరకు కమీషన్ ముట్టజెప్పాల్సిందే. - 8లో



శనగల బసవన్నకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణం లోని శనగల బసవన్న, బయలువీరభద్ర స్వామి వారికి మంగళవారం శాస్త్రోక్తంగా విశేషపూజలు నిర్వహించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,629.60
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:92.572
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:3,173
అవుట్ ఫ్లో	:5,580

న్యూస్‌రీల్

విత్తన శుద్ధి కేంద్రం తనిఖీ



స్టాక్ వివరాలు తెలుసుకుంటున్న వ్యవసాయాధికారులు

నంద్యాల(అర్బన్): స్థానిక శ్రావణలక్ష్మి సీడ్స్‌లో జరుగుతున్న విత్తన శుద్ధి పనులను జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ మంగళవారం తనిఖీ చేశారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల శుద్ధి చేసిన విత్తన స్టాక్ నిల్వ రిపోర్ట్‌లను కంపెనీల వారీగా మండల వ్యవసాయాధికారి, జిల్లా వ్యవసాయాధికారులకు అందజేయాలన్నారు. ఆయన వెంట ఏఓ ప్రసాదరావు, నిర్వాహకులు శివారెడ్డి, నాగలింగేశ్వరరెడ్డి ఉన్నారు.

మెగా పేరెంట్స్ డేకు నిధుల మంజూరు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 7న పాఠశాలల్లో నిర్వహించనున్న మెగా పేరెంట్స్ డేకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 1,400 పాఠశాలల్లో 1,36,358 మంది విద్యార్థులున్నారు. విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని జిల్లాకు రూ.33,08,800 నిధులు కేటాయించి మంజూరు చేసినట్లు రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని డీఈఓ తెలిపారు. కాగా మెగా పేరెంట్స్ - టీచర్స్‌ను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే విధివిధానాలను రూపొందించి ఉపాధ్యాయులకు తెలియజేశామన్నారు.

శ్రీశైలం డ్యాంలో 120 టీఎంసీల నీరు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాంలో మంగళవారం సాయంత్రానికి 120.3680 టీఎంసీల నీరు నిల్వ ఉంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల సెల్ఫ్ క్యాచ్‌మెంటలో మూడురోజులుగా వర్షాలు కురుస్తుండడంతో జలాశయంలోకి 3,343 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. దిగువ ప్రాజెక్ట్‌లకు 9,943 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో 1.970 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు.ప్రస్తుతం డ్యాం నీటిమట్టం 864.40 అడుగులకు చేరుకుంది.

రేపు ఇంటర్వ్యూలు

నంద్యాల(అర్బన్): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షణలో కొనసాగుతున్న సఖీ-1 స్టాఫ్ సెంటర్(మిషన్ శక్తి-సంబల్)లో ఖాళీగా ఉన్న సెంటర్ అడ్మినిస్ట్రేషన్ కేసు వర్కర్ పారా లీగల్ పర్సనల్ సైకో సోషల్ కౌన్సిలర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థినులకు ఈనెల 5న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారత అధికారిణి లీలావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కంప్యూటర్ ద్వారా ఎంపికైన అభ్యర్థినుల స్క్రీనింగ్ టెస్టు పూర్తయిందన్నారు. అభ్యర్థుల మార్కులు, మెరిట్ లిస్ట్,షార్ట్ లిస్ట్‌ను http:// nandyal. ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. షార్ట్‌లిస్ట్ అభ్యర్థినులు ఈనెల 5న సాయంత్రం 4గంటలకు వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

రేపటి నుంచి ఉచిత శిక్షణ

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐ ఎదుట ఉన్న న్యాక్ కేంద్రంలో ఈనెల 5 నుంచి సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్, అసిస్టెంట్ సర్వేయర్ విభాగాల్లో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి శ్రీకాంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసై, ఆసక్తి ఉన్న నిరుద్యోగులు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9542643747, 9573108032 నంబర్లను సంప్రదించాలన్నారు.

శ్రీశైలం ఈఓగా ఎం.శ్రీనివాసరావు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా ఎం.శ్రీనివాసరావును నియమిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత కార్యనిర్వహణాధికారి ఎస్ఎస్ చంద్రశేఖర ఆజాద్‌ను విధుల నుంచి ప్రభుత్వం తప్పించి ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు సభ్యుడిగా ఉన్న ఎం.శ్రీనివాసరావు డిప్యూటేషన్‌పై ఈఓగా నియమించింది. ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా గత శుక్రవారం వెలువడిన డిప్యూటీ కలెక్టర్ల బదిలీల ఉత్తర్వుల్లో శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారిగా ఎం.శ్రీనివాసరావు పేరు ఉన్నప్పటికీ గంట వ్యవధిలోనే ఆయన పేరును తొలగించి మరో ఉత్తర్వు జారీ చేశారు. నాటకీయ పరిణామాల మధ్య మంగళవారం ఎం.శ్రీనివాసరావును శ్రీశైలం ఈఓగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

☛ పాణ్యం గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు 220 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఆరుగురు అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. గత నెల 14న నుంచి తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఆరుగురూ సమ్మెలోకి వెళ్లడంతో ప్రిన్సిపాలే అన్ని తరగతులకు ఉపాధ్యాయుడిగా మారి పాఠాలు చెబుతున్నారు. దీంతో పదవ తరగతి విద్యార్థుల చదువు ప్రశ్నార్థకంగా మారింది. పరీక్షల ఫలితాలపై దీని ప్రభావం పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

☛ తుగ్గలి గిరిజన బాలుర గురుకులంలో 115 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలలో ఎనిమిది మంది ఔట్ సోర్సింగ్ టీచర్లు పాఠాలు బోధిస్తున్నారు. వీరిలో ఒకరు (ఆర్ట్, క్రాఫ్ట్) మినహా మిగిలిన ఏడుగురు సమ్మె బాట పట్టారు.

☛ జిల్లా కేంద్రమైన కర్నూలులోని గిరిజన బాలికల గురుకులంలో 244 మంది విద్యార్థినులు ఉన్నారు. ఈ పాఠశాలలో ఉన్న ఐదుగురు ఔట్ సోర్సింగ్ టీచర్లు సమ్మెలో ఉండగా, మిగిలిన ఒక రెగ్యులర్ టీచర్ సోషల్, ప్రిన్సిపాల్ బయాలజీ సబ్జెక్టులను బోధిస్తున్నారు.

ఉద్యమ బాటలో గురుకులాల అవుట్ సోర్సింగ్ టీచర్లు

- గత నెల 14 నుంచి విధులకు గైర్హాజరు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో తొమ్మిది గురుకులాల్లో అన్ని సబ్జెక్టు టీచర్ల కరువు
- సమీప స్కూళ్ల నుంచి టీచర్లను పంపాలని కోరినా ఫలితం శూన్యం
- నాడు వైఎస్ జగన్ అందించిన ఐఎఫ్‌పీ ద్వారా కొనసాగుతున్న బోధన



ఉమ్మడి జిల్లాలో గిరిజన సంక్షేమ గురుకులాలు	
శ్రీశైలం	ఆర్ఎస్ (బాలురు)
మహానంది	ఆర్ఎస్ (పీటీజీ బాలికలు)
శ్రీశైలం	ఎస్ఓఈ (బాలురు)
బైర్లూటీ	హెచ్‌సీఆర్ఎస్ (బాలికలు)
పాణ్యం	హెచ్‌సీఆర్ఎస్ (బాలురు)
ఆలూరు	హెచ్‌సీఆర్ఎస్ (బాలికలు)
ఆళ్లగడ్డ	హెచ్‌సీఆర్ఎస్ (బాలురు)
కర్నూలు	హెచ్‌సీఆర్ఎస్ (బాలికలు)
తుగ్గలి	హెచ్‌సీఆర్ఎస్ (బాలురు)

గురువు లేని చదువులు

ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ పెద్దలను వేడుకున్నా వారు కనికరించకపోవడంతో గురుకులాల గురువులు సమ్మె బాట పట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని తొమ్మిది ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో శాంక్షన్ పోస్టులు లేకపోవడంతో 90 శాతానికి పైగా అవుట్ సోర్సింగ్ టీచర్లే విద్యాబోధన చేస్తున్నారు. వీరంతా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత నెల 14 నుంచి ఉద్యమ బాట పట్టారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనున్న మెగా డీఎస్సీ నుంచి గురుకులాల్లోని ఔట్ సోర్సింగ్ పోస్టులను మినహాయించాలని, చాలీచాలని వేతనాలతో జీవితాలను సాగిస్తున్న తమను కాంట్రాక్టు రెగ్యులర్ టీచర్స్ (సీఆర్‌టీ)గా పరిగణించాలని వారు సమ్మె చేస్తున్నారు. సమస్యను అర్థం చేసుకుని సకాలంలో పరిష్కరించాల్సిన కూటమి ప్రభుత్వం.. కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- కర్నూలు(అర్బన్)

గిరిజన గురుకులాల్లో టీచర్లు లేకపోవడంతో విద్యా బోధన అటకెక్కింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని తొమ్మిది గిరిజన గురుకులాల్లో 3 నుంచి 10వ తరగతి వరకు దాదాపు 2 వేలకు పైగా విద్యార్థులున్నారు. ఆయా పాఠశాలల్లో ఒకరిద్దరు మినహా మిగిలిన టీచర్లందరూ సమ్మెలో ఉన్నందున ఆయా సబ్జెక్టులను బోధించే వారు కరువయ్యారు. మరో మూడు నెలల్లో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పలు పాఠశాలల్లో ఇంకా వివిధ సబ్జెక్టుల్లో సిలబస్ పూర్తి కాలేదు. కర్నూలు బాలికల గురుకులంలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు సమ్మెలోకి వెళ్లకముందు నుంచి కూడా తెలుగు బోధించే వారు లేక పోవడం దురదృష్టకరం. లెక్కలు, సైన్స్, ఇంగ్లీషు సబ్జెక్టులకు సంబంధించి సిలబస్ కాకపోవడం, రివిజన్ చేయకపోవడం వల్ల విద్యార్థులు పరీక్షల పట్ల ఆందోళన చెందుతున్నారు.

డీఈఓకు లేఖ రాసినా స్పందన కరువు ..

గిరిజన గురుకులాల్లోని అవుట్ సోర్సింగ్ టీచర్లందరూ సమ్మెలో ఉన్న కారణంగా విద్యా బోధన కుంటుపడకుండా ఉండేందుకు సమీప ప్రభుత్వ పాఠశాలల్లోని టీచర్లను వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద పంపాలని గత నెల 18న జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు డీఈఓకు లేఖ రాసినట్లు సమాచారం. కారణాలేమో కానీ ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో చదువులు చెప్పే ఉపాధ్యాయులు లేక గిరిజన గురుకులాల్లో విద్య మిథ్యగా మారింది.



కర్నూలులోని గిరిజన బాలికల గురుకుల పాఠశాల

ఐఎఫ్‌పీ ద్వారా కొనసాగుతున్న బోధన

ప్రభుత్వ పాఠశాలల్లో కూడా కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్యాబోధన అందించాలనే సదుద్దేశంతో నాడు - నేడు కింద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రతి స్కూల్‌కు రూ.లక్ష వెచ్చించి ఐఎఫ్ఎల్ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్) సిస్టమ్స్‌ను సమకూర్చారు. ప్రస్తుతం టీచర్లు లేకపోయినా ఉన్న ప్రిన్సిపాల్స్, ఒకరిద్దరు రెగ్యులర్ టీచర్లు ఈ ఐఎఫ్ఎల్ సిస్టమ్ ద్వారా విద్యాబోధన కొనసాగిస్తున్నారు. ఇవి లేకపోతే విద్యార్థుల పరిస్థితి ఏమిటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

తూతూ మంత్రంగా చర్యలు..

కూటమి ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ టీచర్ల సమస్యకు పరిష్కారం చూపకుండా తూతూమంత్రంగా ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది పాఠశాలల్లో విద్యా బోధనకు సంబంధించి ప్రభుత్వం పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 29 మంది టీచర్లను డిప్యూటేషన్‌పై ఇక్కడకు పంపించేందుకు గత నెల 28న ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు ఉత్తర్వులు జారీ చేశారు.

త్వరలో డిప్యుటేషన్‌పై టీచర్లు వస్తారు



గిరిజన గురుకులాల్లో విద్యాబోధన కుంటుపడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాకు 29 మంది ఆశ్రమ పాఠశాలల టీచర్లను డిప్యుటేషన్ వేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. రెండు, మూడు రోజుల్లో వారు విధుల్లో చేరే అవకాశం ఉంది.

- కేవీ శివప్రసాద్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి, నంద్యాల

చదువులు భంగం



గురుకులాల టీచర్లు సమ్మె చేస్తుండడంతో విద్యార్థుల చదువులు భంగం అవుతున్నాయి. 20 రోజుల నుంచి టీచర్లు ఎవరూ లేకపోవడంతో స్కూళ్లలో బోధన అగమ్యగోచరంగా తయారైంది. ప్రభుత్వం టీచర్ల సమస్యలను పరిష్కరించి విద్యార్థుల చదువులు సాగేలా చర్యలు తీసుకోవాలి.

- రవికుమార్, విద్యార్థి తండ్రి, రామలింగాయపల్లి, తుగ్గలి మండలం

అయోమయంలో విద్యార్థులు



గిరిజన గురుకులాల్లో ఔట్ సోర్సింగ్ టీచర్లందరు సమ్మె చేస్తుండడం వల్ల చదువు చెప్పే వారు లేకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. పలు పాఠశాలల్లో విద్యార్థులే గురువులుగా మారగా, మరి కొన్ని పాఠశాలల్లోని తరగతి గదుల్లో పుస్తకాలు తిరగేస్తున్నారు. ఉపాధ్యాయులు లేకపోవడం వల్ల ఆయా పాఠశాలల్లో విద్యార్థులు కూడా ఇంటి బాట పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే చొరవ చూపించి గిరిజన గురుకులాల్లో విద్యాబోధన జరిగేలా చర్యలు చేపట్టాల్సి ఉంది.

- ఆర్ చంద్రప్ప, ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు

శ్రమను గుర్తించాలి



తక్కువ వేతనంతో గురుకులాల్లో ఏళ్లుగా పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ టీచర్ల శ్రమను ప్రభుత్వం గుర్తించాలి. వారి సమస్యలను పరిష్కరించాలి. సీఆర్‌టీలుగా పరిగణించాలని, డీఎస్సీలో తామున్న స్థానాలను మినహాయించాలనే డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా నెరవేర్చాలి. ఇప్పటికే 20 రోజులుగా వారు విధులకు హాజరు కాకపోవడం వల్ల ఆయా గురుకులాల్లో విద్యాబోధన కుంటుపడింది.

- ఎం శివప్రసాద్, ఏపీఎస్‌వైఎఫ్ జిల్లా అధ్యక్షులు

మెరుగైన విద్యా బోధన అందించండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన విద్యాబోధన అందించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యార్థుల పాస్ పర్సెంటేజ్‌పై జూనియర్ కాలేజీలల ప్రిన్సిపాళ్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 140 జూనియర్ కళాశాలల్లో 5,861 మంది విద్యార్థులకు గానూ ఈ ఏడాది త్రైమాసిక పరీక్షల్లో కేవలం 2,252 మంది విద్యార్థులకే పాస్ పర్సెంటేజ్ రావడం బాధాకరమన్నారు. విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన విద్యాబోధన అందించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. పిల్లలకు కనీసం పాస్ మార్కులు కూడా తెప్పించలేని స్థితిలో అధ్యాపకులు ఉన్నారని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అర్థమయ్యే రీతిలో బోధించాలన్నారు. పదో తరగతిలో 80 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో 50 శాతం మార్కులు కూడా తెచ్చుకోలేకపోవడానికి కారణాలను విశ్లేషించి తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుని ఉత్తమ ఫలితాల కోసం కృషి చేయాలన్నారు. సమావేశంలో డీవీఈఓ సునీత, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా భవిత కో ఆర్డినేటర్ రఘురామిరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): దివ్యాంగ విద్యార్థులు భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా భవిత కో ఆర్డినేటర్ రఘురామిరెడ్డి సూచించారు. మంగళవారం పొట్టి శ్రీరాములు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు భవిత కేంద్రాల్లో అందిస్తున్న ఫిజియోథెరపీ, ప్రత్యేక విద్య, స్పీచ్ థెరపీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ మహమ్మద్ బేగ్, ఎంఈఓలు బ్రహ్మంనాయక్, శివరాం పాల్గొన్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

నంద్యాల(అర్బన్): విజయ డెయిరీ పరిధిలోని 120 పాల సహకార సొసైటీల్లోని బోర్డు డైరెక్టర్ల ఎంపికకు బుధవారం నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. ఒక్కో సొసైటీలో 10 మంది బోర్డు డైరెక్టర్లు ఉండగా ప్రతి ఏడాది ఇద్దరు డైరెక్టర్లు పదవీ విరమణ చేస్తారు. పదవీ విరమణ చేసిన స్థానాలకు నామినేషన్లు స్వీకరిస్తుండటంతో గ్రామాల్లోని పాల సహకార సొసైటీల్లో సందడి నెలకొంది.

ఫెంగల్‌తో అన్నదాత వర్రీ!

- వరి రైతులను దెబ్బ తీసిన తుపాన్
- ఐదురోజులుగా కురిసిన వర్షానికి తడిచిన దిగుబడులు
- రంగు మారితే ధరపై ప్రభావం చూపుతుందని అన్నదాత ఆందోళన



అమ్మిరెడ్డినగరంలో నేలవాలిన కోతకొచ్చిన వరిపంట

నంద్యాల(అర్బన్): ఫెంగల్ తుపాన్ దెబ్బకు వరి రైతులు విలవిల్లాడుతున్నారు. జిల్లాలో 1.60 లక్షల హెక్టార్లలో వరి పంట సాగైంది. బావులు, చెరువుల కింద సాగు అయిన వరి కోతలు పూర్తయి ధాన్యాన్ని కల్లాల్లో ఆరబోసుకున్నారు. ఈ క్రమంలో మూడు రోజులుగా చిరు జల్లులతో కూడిన ఫెంగల్ తుపాన్ నుంచి తేరుకోవచ్చని అనుకున్న రైతులకు సోమ, మంగళవారాల్లో కురిసిన వర్షంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఓ వైపు పంట దిగుబడులు అంతంత మాత్రంగానే రావడం.. మరో వైపు ఫెంగల్ తుపాన్ కారణంగా తడిచిపోవడంతో ధరపైనా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రంగు మారుతున్న ధాన్యం

నంద్యాల, నందికొట్కూరు, బనగానపల్లె, ఆత్మకూరు నియోజకవర్గాల్లో రైతులు చాలా వరకు ఇప్పటికే వరి కోతలు కోసి కల్లాల్లో దిగుబడులను ఆరబోసుకున్నారు. కల్లాల్లోని ధాన్యం తుపాన్‌కు తడిచిపోయి రంగు మారుతుండటం, అక్కడక్కడా కోతలకు సిద్ధంగా ఉన్న పైరు నేలవాలడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. రంగు మారిన ధాన్యం కొనుగోలుకు ఎవరూ ముందుకు రారని, నేలకొరిగిన పైరు గింజలు రాలు పడే అవకాశం ఉందని రైతుల ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు. కాగా రబీలో సాగు చేసిన జొన్న, మొక్కజొన్న, శనగ, మినుము, ఆవాల పైర్లు ఎండు దశకు చేరుకున్న తరుణంలో ఫెంగల్ తుపాన్ జీవం పోసింది.

అవుకు మండలంలో 16.6 మి.మీ వర్షం

సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు జిల్లాలో పలు చోట్ల వర్షం కురిసింది. అవుకు మండలంలో అత్యధికంగా 16.6 మి.మీ వర్షం కురవగా పాములపాడు మండలంలో అత్యల్పంగా 1.2 మి.మీ వర్షం కురిసింది. బేతంచెర్లలో 14.2, గోస్పాడు 13.2, శిరివెళ్ల 12.6, పాణ్యం, కొత్తపల్లి, బండిఆత్మకూరు 10.8, సంజామల 10.6, శ్రీశైలం 10.4, రుద్రవరం 9.2, నంద్యాల 8.4, ఉయ్యాలవాడ, ఆత్మకూరు 8.2, ఆళ్లగడ్డ 7.8, కొలిమిగుండ్ల 7.0, దొర్నిపాడు 6.6, బనగానపల్లె 6.2, చాగలమర్రి, వెలుగోడు, కోవెలకుంట్ల 5.8, గడివేముల 5.2, ప్యాపిలి 4.4, మిడుతూరు 3.4, డోన్ 2.8, జూపాడుబంగ్లా 2.6, నందికొట్కూరు 1.8, పగిడ్యాల 1.6 మి.మీ వర్షం కురిసింది.



మహానంది మండలం గోపవరం గ్రామం వద్ద వరి దిగుబడులపై పట్ట కప్పుతున్న రైతు

సామాన్య భక్తులకు పెద్దపీట

శ్రీశైల దేవస్థానం కీలక నిర్ణయం

- ప్రభుత్వ సెలవు, శని, ఆది, సోమవారాల్లో భక్తులందరికీ స్వామివారి అలంకార దర్శనం
- శని, ఆది, సోమవారాల్లో గర్భాలయ, సామూహిక అభిషేకాలు, స్పర్శదర్శనం నిలుపుదల



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ సెలవు రోజుల్లో, శని, ఆది, సోమవారాల్లో, వైదిక కమిటీ నిర్ధారించిన రోజుల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ మల్లికార్జునస్వామివారి అలంకార దర్శనం కల్పించాలని నిర్ణయించింది. శని, ఆది, సోమవారాల్లో ఉదయాస్తమాన, ప్రదోషకాల, ప్రాతఃకాల, గర్భాలయ, సామూహిక అభిషేకాలు, స్వామివారి స్పర్శదర్శనం నిలుపుదల చేస్తూ దేవస్థాన ఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. దేవస్థానం నిలుపుదల చేసిన టికెట్ల వివరాలను వార్షిక క్యాలెండర్ మాదిరిగా విడుదల చేయాలని నిర్ణయించింది. రద్దీ రోజురోజుకు పెరుగుతున్న కారణంగా, సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్ మంగళవారం తెలిపారు. ఈనెల 1వ తేదీన దేవస్థాన వైదిక కమిటీ, సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. రద్దీ రోజులలో భక్తులందరికీ స్వామివారి అలంకార దర్శనం కల్పించబడుతుందన్నారు. భక్తులు ఈ మార్పులను గమనించాల్సిందిగా ఈఓ విజ్ఞప్తి చేశారు.

ఏ ఆర్జిత సేవలు రద్దు చేశారంటే:

☛ ప్రతి శని, ఆది, సోమవారాల్లో, ప్రభుత్వ సెలవు రోజులు, వైదిక కమిటీ సూచించిన విశేష రోజులలో రూ.500 రుసుంతో కల్పించబడుతున్న స్వామివారి స్పర్శదర్శనం

☛ రూ.5,000 రుసుముతో నిర్వహిస్తున్న గర్భాలయ అభిషేకాలు

☛ రూ.1500రుసుముతో నిర్వహిస్తున్న సామూహిక ఆర్జిత అభిషేకాలు

☛ అమ్మవారి ఆలయ ముఖమండపంలో నిర్వహించు కుంకుమపూజలు కూడా నిలుపుదల చేశారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో టికెట్లు పొందిన భక్తులకు మాత్రం ఆయా సేవలు నిర్వహిస్తారు. అయితే ఈ రద్దీ రోజుల్లో వృద్ధ మల్లికార్జునస్వామివారికి జరుపబడుతున్న ఆర్జిత అభిషేకాలు, ఆలయంలో జరిగే అన్ని రకాల ఆర్జితసేవలు యథావిధిగా కొనసాగుతాయి.

పెద్దాసుపత్రిలో కొత్తగా అడ్మినిస్ట్రేటర్

- డిప్యూటీ కలెక్టర్ సింధు సుబ్రహ్మణ్యం నియామకం
- ఆసుపత్రి, కళాశాలల్లో కీలక బాధ్యతలన్నీ వీరి చేతికి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అడ్మినిస్ట్రేటర్‌ను నియమించింది. ఈ మేరకు రెండు రోజుల క్రితం డిప్యూటీ కలెక్టర్ సింధు సుబ్రహ్మణ్యంకు నియామక ఉత్తర్వులు అందజేసింది. ఇకపై దాదాపుగా కళాశాల, ఆసుపత్రి వ్యవహారాలన్నీ వీరి ద్వారానే నిర్వర్తించేలా ఉత్తర్వులు జారీ చేశారు. అడ్మినిస్ట్రేటర్ ద్వారానే ఇకపై ఆసుపత్రిలో రోజు వారి కార్యకలాపాలైన ఓపీడీ, ఐపీడీ, ఐసీయు, ఆపరేషన్ థియేటర్స్, స్పెషాలిటీ యూనిట్స్ (బ్లడ్ బ్యాంక్, పీఐసీయూ, ఎస్ఎన్‌సీయూ, ఎన్‌బీఎస్‌యూ, ఎన్ఆర్‌సీ) పర్యవేక్షిస్తారు. భవనాలు, ఎలక్ట్రికల్, వాటర్ సప్లయ్, లిఫ్ట్‌లు, ఏసీలు, సీసీ టీవీలు, బయోమెడికల్ పరికరాలు, ప్రభుత్వ వాహనాలు, అంబులెన్స్‌లు, మహాప్రస్థానం వాహనాలు సక్రమంగా పనిచేసేలా చూస్తారు. ఆసుపత్రిని ఇన్‌ఫెక్షన్ రహితంగా తయారు చేసేలా చర్యలు తీసుకుంటారు. దీంతో పాటు పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో కొనసాగుతున్న సెక్యూరిటీ, పారిశుద్ధ్యం, పెస్ట్‌కంట్రోల్, లాండ్రీ, బయో మెడికల్ పరికరాలు నిర్వహణ తదితరాలను పర్యవేక్షిస్తారు. అన్ని రకాల ఔషధాలు, ల్యాబ్ రీ ఏజెంట్స్, కన్జ్యూమబుల్స్, బ్లడ్ అందుబాటులో ఉండేలా చేస్తారు. ఉద్యోగుల నియామకం కోసం డిస్ట్రిక్ట్ సెలెక్షన్ కమిటీలో బాధ్యతలు పోషిస్తారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలను వెబ్‌సైట్, బోర్డుల ద్వారా ప్రదర్శించే ఏర్పాట్లు చేస్తా రు. హెచ్‌డీఎస్ సభ్యులు, ప్రభుత్వ ప్రతినిధులు, డిపార్ట్‌మెంట్ హెడ్‌లు, ఆసుపత్రి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ అందుబాటులో ఉంటారు. అయితే ప్రస్తుతం ఆసుపత్రి సూపరింటెండెంట్, సీఎస్ఆర్ఎంఓ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ, ఏఆర్ఎంఓ, ఏడీ విధులు, వ్యవహారాల్లో భారీగా కోత పడే అవకాశం ఉంది.

ముడుపులు ఇచ్చుకోవాల్సిందే!

- బిల్లులు పెట్టేందుకు జిల్లా వ్యవసాయశాఖ అధికారి కార్యాలయం కాసులు డిమాండ్
- ఇటీవలనే మట్టి నమూనాల సేకరణకు విడుదలైన బిల్లులు
- ఆస్పిరేషన్ బ్లాక్‌ల నుంచి 50 శాతం ముడుపుల కింద వసూలు
- మిగిలిన 19,500 మట్టి నమూనాల సేకరణకు పెట్టిన బిల్లుకు రూ.9.75 లక్షలు విడుదల
- ఇందులో కమీషన్‌ల కింద 40 శాతం వసూలు
- రైతులకు అందని భూసార పరీక్షల ఫలితాలు
- ఆర్‌ఏడీ పరిశ్రమలకు మిషనరీ సరఫరా చేసిన కంపెనీల నుంచి సైతం వసూళ్లు
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం కమీషన్‌ల మత్తులో జోగుతోంది. వివిధ కార్యక్రమాలకు సంబంధించి బిల్లులు విడుదలైతే చాలు... 30 నుంచి 50 శాతం వరకు కమీషన్ ముట్టజెప్పాల్సిందే. ఈ వ్యవహారం ప్రస్తుతం జిల్లా వ్యవసాయ శాఖలో హాట్ టాపిక్‌గా మారింది. మండలాల్లో ఏ కార్యక్రమం నిర్వహించినా జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం బిల్లు పెడుతుంది. ప్రభుత్వం నుంచి నేరుగా సంబంధిత మండల వ్యవసాయ అధికారి బ్యాంకు ఖాతాలకు నగదు విడుదల అవుతుంది. ఈ ప్రక్రియ సాఫీగా సాగాలంటే కమీషన్ ఇచ్చుకోవాల్సిందేనంటూ జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం ఏఓలపై వత్తిడి పెంచుతోంది. లేకపోతే తనిఖీల పేరుతో ఇబ్బందులు వస్తాయని హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది. బిల్లులు పెట్టడం, కమీషన్లు వసూలు చేయడంలో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఇద్దరు ఏఓలు కీలకంగా వ్యవహరిస్తున్నారని, వీరికి జిల్లా వ్యవసాయ అధికారి అండదండలు ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆర్‌ఏడీ ప్రోగ్రాం నుంచి ముడుపులు

జిల్లాలో రెయిన్‌ఫెడ్ ఏరియా డెవలప్ మెంట్ కింద 21 మండలాలు ఉన్నాయి. వెనుక బడిన ఈ మండలాల్లో గత ప్రభుత్వం ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లా మొత్తంగా 26 యూనిట్లు ఏర్పాటుకాగా ఒక్కో యూనిట్‌కు రూ.2 లక్షల వరకు సబ్సిడీ ప్రకటించింది. ఈ యూనిట్‌లకు మిషనరీ సరఫరా చేసిన కంపెనీలను జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం వదలలేదు. ఒక్కో యూనిట్‌కు రూ.10 వేల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది.

ఈ రెండే కాదు

ఇలా ప్రతి పనికి బిల్లు పెట్టేందుకు వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయం ముడుపులు, కమీషన్లు వసూలు చేస్తుందనే ఫిర్యాదులు వెల్లువెత్తున్నాయి.

5 శాతం కమీషన్‌పై భూ సంరక్షణ బిల్లు

భూసంరక్షణ విభాగానికి సంబంధించి 2014 -2019 మధ్య భారీగా అక్రమాలు జరిగాయి. ఈ విభాగానికి డోన్, కర్నూలు, ఆదోని డివిజన్లు ఉన్నాయి. 5శాతం కమీషన్‌పై ఏడేనిమిదేళ్ల క్రితం పైపులు, స్ప్రింక్లర్లు తదితర వాటికి రూ.70 లక్షల బిల్లులు పెట్టినట్లు సమాచారం. అప్పట్లో భూసంరక్షణ విభాగంలో డీడీగా పనిచేసిన అధికారి ప్రస్తుతం ఎమ్మిగనూరు ఫాంలో పనిచేస్తున్నారు. సదరు అధికారి ఇక్కడ లేకపోయినా లేటెస్ట్ తేదీతో బిల్లుల మీద సంతకాలు పెట్టడం గమనార్హం.



భూసార పరీక్ష కేంద్రాలకు వచ్చిన మట్టి నమూనాలు

ఆస్పిరేషన్ బ్లాక్‌ల నుంచి 50 శాతం కమీషన్లు

ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం కింద భూసార పరీక్షల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. జిల్లాలో ఆస్పిరేషన్ మండలాలుగా చిప్పగిరి, మద్దికెర, హొళగుంద మండలాలను కేంద్రం ఎంపిక చేసింది. ఈ మండలాల నుంచి లక్ష్యం మేరకు మట్టి నమూనాలు సేకరించారు. ఈ మట్టి నమూనాలకు ఎమ్మిగనూరు భూసార పరీక్ష కేంద్రంలో పరీక్షలు నిర్వహించి.. ఫలితాలను రైతులకు అందజేస్తారు. భూసార పరీక్ష ఫలితాలకు అనుగుణంగా రసాయన ఎరువులు, సూక్ష్మపోషకాలు, సేంద్రియ ఎరువులు వినియోగిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉత్పాదకత సాధించే అవకాశం ఉంది. 2023-24 సంవత్సరానికి సంబంధించి 851, 2024-25 సంవత్సరానికి సంబంధించి 4,193 మట్టి నమూనాలు సేకరించి ఎమ్మిగనూరు భూసార పరీక్ష కేంద్రానికి పంపారు. ఒక్కో శ్యాంపిల్ తీసినందుకు మండల వ్యవసాయ అధికారికి 50 పైసలే చెల్లిస్తారు. రెండేళ్లకు సంబంధించి రూ.3 లక్షలకు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం బిల్లు పెట్టింది. ఇటీవల ఆయా మండల వ్యవసాయ అధికారి బ్యాంకు ఖాతాలకు నగదు జమ అయింది. శ్యాంపిల్‌కు 50 పైసలు ప్రభుత్వం ఇస్తుండగా.. ఇందులో 22.50 పైసలు డీఏఓ కార్యాలయం ఏఓలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇలా అస్పిరేషన్ బ్లాక్‌ల నుంచే కాకుండా మిగిలిన అన్ని మండలాల నుంచి 2024-25లో భూసార పరీక్షలకు పెద్ద ఎత్తున మట్టి నమూనాలు సేకరించారు. వీటికి సంబంధించి జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం రూ.9.75 లక్షలకు బిల్లు పెట్టి 40 శాతం కమీషన్లు దండుకున్నట్లు ఆరోపణలున్నాయి. దీనిపై జిల్లా వ్యవసాయాధికారి పీఎల్ వరలక్ష్మి వివరణ కోరగా కమీషన్ల వసూలులో వాస్తవం లేదన్నారు.

పోస్టులు మూడు.. పని చేస్తున్నది ఏడుగురు....

జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో సాంకేతిక ఏఓ పోస్టులు 3 మాత్రమే ఉన్నాయి. అయితే ఏడుగురు సాంకేతిక ఏఓలు పని చేస్తున్నారు. అంటే అదనంగా నలుగురు పని చేస్తున్నారు. వీరు ఉన్నతస్థాయిలో పైరవీలు చేసుకొని డిప్యుటేషన్‌లపై జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో తిష్ట వేశారనే విమర్శలు ఉన్నాయి.

రైతులకు అందని భూసార పరీక్ష ఫలితాలు

మట్టి నమూనాల సేకరణకు సంబంధించి బిల్లులు విడుదల అయ్యాయి. అధికారులు కమీషన్లు కూడా పిండుకున్నారు. అయితే, రైతులకు మాత్రం భూసార పరీక్షలకు సంబంధించిన ఫలితాలు అందలేదు. సాధారణంగా రైతుల సెల్‌ఫోన్లకు భూసార పరీక్షల ఫలితాలపై సంక్షిప్త సమాచారం మెసేజ్ రూపంలో అందాలి. అలాగే మాన్యువల్‌గా ప్రింట్ తీసి కూడా ఇవ్వాలి. ఆస్పిరేషన్ బ్లాక్‌ల నుంచి 6000, ఇతరత్రా అన్ని మండలాల నుంచి 19,500 భూసార పరీక్షలు నిర్వహించినా ఇంతవరకు 30 శాతం మందికి కూడా ఫలితాలు అందలేదు.

క్లుప్తంగా

పట్టుసాగులో లక్ష్యాలు సాధించాలి



వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా పట్టు పరిశ్రమ అధికారి విజయకుమార్, తదితరులులు

కర్నూలు(అగ్రికల్చర్): పట్టు సాగులో లక్ష్యాలు సాధించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆ శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం గుంటూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పట్టు పరిశ్రమపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ... పట్టుసాగుపై రైతులకు అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. 2024-25లో 250 టన్నుల పట్టుగూళ్ల ఉత్పత్తి చేయాలనేది లక్ష్యమని, ఇందుకు అనుగుణంగా ఉత్పాదకత పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. మార్చి నెల చివరిలోపు 100 శాతం లక్ష్యాలను సాధించాలని తెలిపారు. ఈఏడాది 2.80 లక్షల బైవోల్టైన్ పట్టు గుడ్లను బ్రస్సింగ్ చేయాలని, ఇందుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. కర్నూలు నుంచి పట్టు పరిశ్రమ శాఖ అధికారి విజయకుమార్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు సాధించిన ప్రగతిని వివరించారు. జిల్లాలో 10 షెడ్లు మంజూరు చేశామని, ఇందులో ఐదు ప్రోగ్రెస్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అసిస్టెంటు సెరికల్చర్ అధికారులు రమణారెడ్డి, మాసుం, రమణయ్య పాల్గొన్నారు.

బావిలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

ఆత్మకూరు రూరల్: పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న బావిలో ఓ వ్యక్తి మంగళవారం శవమై కనిపించాడు. పోలీసులు శవాన్ని వెలికి తీసి విచారించగా కొత్తపల్లె మండలం దుద్యాలకు చెందిన షేక్ కాబేతుల్లా(40)గా గుర్తించారు. కొద్దిరోజుల క్రితం అతని భార్య అనారోగ్యంతో మృతిచెందింది. ఈ విషాదం నుంచి బయటకు రాలేక మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల మతిస్థిమితం కోల్పోయి తిరుగుతూ ఉండేవాడు. ఈక్రమంలో బావిలో పడి మృతిచెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసుకున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

బొమ్మలసత్రం: పట్టణంలోని సాధిక్‌నగర్‌కు చెందిన షేక్ అల్లాబకాష్ (32) ఉరివేసుకుని మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. త్రీటౌన్ సీఐ సూర్యమౌళి తెలిపిన వివరాలు.. అల్లాబకాష్ కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. మంగళవారం వేకువజామున ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తల్లి షేక్ ఉస్సేబీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేత్రాలు దానం



కుమారుడి నేత్రాలను సాయిజ్యోతి నేత్రదాన ఐ ఫౌండేషన్‌కు అందజేస్తున్న దృశ్యం

ఆదోని టౌన్: పుట్టెడు దుఃఖంలోను ఓ వ్యక్తి నేత్రాలను దానం చేసి గొప్ప మనసు చాటుకున్నారు కుటుంబసభ్యులు. ఆదోని పట్టణానికి చెందిన శ్యామబాయి కుమారుడు రాకేష్ (47) మంగళవారం మృతి చెందాడు. ఈ మరణాన్ని దిగమింగి కుమారుడు నేత్రాలను దానం చేసేందుకు తల్లి ముందుకు వచ్చారు. సాయిజ్యోతి నేత్రదానం ఐ ఫౌండేషన్ సభ్యులకు సమాచారమివ్వడంతో వారు వచ్చి నేత్రాలు తీసుకెళ్లారు. కళ్లను దానం చేసి మరొకరి జీవితాల్లో వెలుగు నింపారని ఫౌండేషన్ సభ్యులు ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను అభినందించారు.

అమలాపురంలో ఉద్రిక్తత

ఆత్మకూరు రూరల్: మండలంలోని అమలాపురం గ్రామంలో సోమవారం రాత్రి ఉద్రిక్తత నెలకొంది. సాగునీటి సంఘాల ఎన్నికలను ఏకగ్రీవం చేసేందుకు అధికార పార్టీకి చెందిన నాయకులు కొందరు గ్రామానికి వెళ్లి ఆసక్తి ఉన్న వారితో చర్చిస్తుండగా మాటామాటా పెరిగి తోపులాట జరిగి ఉద్రిక్తతకు దారితీసింది. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి వెళ్లి పరిస్థితిని చక్కదిద్దారు. ఘర్షణకు పాల్పడిన ఇరువర్గాలను మంగళవారం పోలీసు స్టేషన్‌కు పిలిపించారు. ఇరువర్గాలు టీడీపీకే చెందిన వారు కావడంతో ఎవరూ ఫిర్యాదు చేయలేదన్న కారణాలతో పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయలేదు.

తలసేమియాతో బాలుడి మృతి



తరుణ్(ఫైల్)

కోసిగి: తలసేమియా ఆ ఇంటా శాపమైంది. బాలుడి బుడిబుడి నడకలతో కళకళలాడాల్సిన ఆ ఇల్లు మూగబోయింది. తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చింది. వివరాలు ఇలా.. మండల కేంద్రం కోసిగిలోని కుమ్మరి వీధిలో నివాసం ఉంటున్న ఉప్పర శ్రీనివాసులు, లక్ష్మి దంపతులకు ముగ్గురు పిల్లలు. రెండో కుమారుడు తరుణ్(7) స్థానిక జేబీఎం ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. ఈ బాలుడు మూడేళ్ల క్రితం నుంచి జ్వరం, తలనొప్పితో బాధపడుతూ ఉండేవాడు. వైద్యులకు చూపించగా తలసేమియా వ్యాధి సోకిందని, ఇందుకు బాలుడికి ప్రతి నెల రక్తం ఎక్కించాలని సూచించారు. దీంతో నాలుగు నెలల పాటు కర్నూలులోని ఓ ఆసుపత్రిలో రక్తం ఎక్కిస్తూ వచ్చారు. అయితే, దీని వల్ల భవిష్యత్తులో కిడ్నీ సమస్య తలెత్తే అవకాశం ఉందని.. మెరుగైన వైద్య కోసం హైదరాబాద్‌కు వెళ్లాలని సూచించారు. కూలీ పనులు చేసుకుని జీవించే శ్రీనివాసులు, లక్ష్మి దంపతులు కుమారుడిని బతికించుకునేందుకు అప్పటికే అప్పు చేసి రూ.6 లక్షల వరకు ఖర్చు చేశారు. తర్వాత దాతల సహాయంతో అక్కడికి తీసుకెళ్లగా కోలుకోలేక సోమవారం రాత్రి మృతి చెందాడు.

కిల్కారి యాప్‌తో గర్భిణికి ప్రయోజనాలు



కిల్కారి యాప్ గురించి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాత్విక

కర్నూలు(హాస్పిటల్): మొబైల్ ఫోన్‌లో కిల్కారి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల గర్భిణికి ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాత్విక అన్నారు. మంగళవారం కర్నూలు నగరంలోని గడ్డ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాత్విక మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, శిశు ఆరోగ్యం, వ్యాధినిరోధక టీకాలు, కుటుంబ నియంత్రణ, కుటుంబ సంక్షేమంపై సమగ్ర సందేశాలు కిల్కారి యాప్ ద్వారా వినవచ్చన్నారు. మహిళ గర్భం దాల్చిన నాలుగవ నెల నుంచి పాలిచ్చే తల్లుల వరకు బిడ్డకు ఏడాది వయస్సు వచ్చేవరకు 72 సార్లు వాయిస్ కాల్స్ సందేశాలు వచ్చేలా కిల్కారి కార్యక్రమాన్ని డిజైన్ చేశారని చెప్పారు. ప్రతి ఆశా కార్యకర్త గర్భిణి మొబైల్ ఫోన్‌లో కిల్కార్ యాప్ డౌన్‌లోడ్ చేయించాలని తెలిపారు. మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ లింగ నిర్ధారణ తెలుసుకుని అబార్షన్లు చేయించుకోవడం చట్టరీత్యా నేరమవుతుందన్నారు. స్త్రీ, పురుషుల లింగ నిష్పత్తిలో అసహజ పెరుగుదలకు దారి తీస్తుందన్నారు. పీసీ పీఎన్‌డీటీ చట్టంపై, గర్భస్థ శిశువులపై లింగ వివక్షకు వ్యతిరేకంగా మహిళా సమాఖ్య సమావేశాల్లో మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, ఆరోగ్య విద్యాబోధకులు పద్మావతి, ప్రాజెక్ట్ నిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

మాతృ మరణాల నివారణకు చర్యలు

- వైద్య ఆరోగ్యశాఖాధికారుల సమావేశంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా



మాతృ మరణాలపై వైద్యుల వివరణ కోరుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో రాబోయే రోజుల్లో ఒక్క మాతృ మరణం కూడా సంభవించకూడదని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా వైద్యాధికారులను ఆదేశించారు. మూడు నెలల్లో 9 మాతృ మరణాలు జరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు తొమ్మిది మంది గర్భిణుల మరణాలపై కలెక్టర్ వైద్యాధికారులతో సమీక్షించారు. ఆయా పీహెచ్‌సీల్లో మాతృ మరణాలు ఎలా జరిగాయన్న విషయాలపై వైద్యుల వివరణ కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఇప్పటి వరకు జరిగిన మాతృ మరణాల కేసులను స్టడీ చేసి వాటి ఆధారంగా స్టాండర్డ్ ట్రీట్ మెంట్ ఇచ్చేందుకు ఎస్‌ఓపీని తయారు చేయాలని ఆదేశించారు. ఈ ఎస్‌ఓపీపై కింది స్థాయి సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో గర్భిణులకు తప్పనిసరిగా రాత్రి ఏ సమయమైనా మెడికల్ ఆఫీసర్ అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించేలా చూడాలన్నారు. గర్భిణులకు 8,9 నెలల సమయంలో ప్రతి వారం పరీక్షలు నిర్వహించి వారు ఆరోగ్యంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. హైబీపీతో మరణాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ఆదోని ఎంసీహెచ్‌లో ఆపరేషన్ థియేటర్ విస్తరణకు డీఎంకు లేఖ రాయాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాధవిని ఆదేశించారు. ఒక మాతృ మరణానికి సంబంధించి చికిత్స చేసిన కర్నూలులోని మనం హాస్పిటల్ వైద్యులు సమావేశానికి హాజరు కాకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి నోటీసు జారీ చేసి వివరణ కోరాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి పాల్గొన్నారు.

6 నుంచి రెవెన్యూ సదస్సులు

కర్నూలు (సెంట్రల్) : 2024 డిసెంబర్ 6 నుంచి 2025 జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు డీఆర్వో నారాయణమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి అర్జీలను ఇవ్వొచ్చు అన్నారు. ప్రతి మండలంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో ఒక బృందం, డిప్యూటీ తహసీల్దార్ ఆధ్వర్యంలో మరో బృందం నిర్దేశించిన గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తాయన్నారు. ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఆకతాయికి జైలు శిక్ష

బండిఆత్మకూరు: మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఆకతాయికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డి గారి రాంభూపాల్ రెడ్డి మంగళవారం జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. మండలంలోని జీసీ పాలెం గ్రామానికి చెందిన తప్పెట రాజు గ్రామంలోని మహిళకు సైగలు చేస్తూ, ఇలలు వేస్తూ అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని రాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నిందితుడిపై నేరం రుజువుకావడంతో ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పినట్లు ఎస్‌ఐ తెలిపారు.


తుంగభద్రలో నిలిచిన ప్రవాహం

కర్నూలు సిటీ: తుంగభద్ర నదిలో ఎగువ నుంచే నీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోయింది. దీంతో సుంకేసుల బ్యారేజీ నుంచి దిగువకు గత మూడు రోజులుగా నీటి విడుదలను నిలిపి వేశారు. నదిలో నుంచి బ్యారేజీలోకి వస్తున్న 1,930 క్యూసెక్కుల రీజనరేటేడ్ వాటర్‌ను కేసీ కెనాల్‌కు విడుదల చేస్తున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు.

హంద్రీనీవా ఎస్ఈ బదిలీ

కర్నూలు (సిటీ) : హంద్రీనీవా సుజల స్రవంతి పథకం-1 పర్యవేక్షక ఇంజినీర్‌గా పనిచేస్తున్న డి.రాంగోపాల్ బదిలీ అయ్యారు. జలవనరుల శాఖ విశాఖపట్నం సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్‌గా నియమిస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. డి.రాంగోపాల్ స్థానంలో హంద్రీనీవా సర్కిల్-1 ఇన్‌చార్జ్ ఎస్ఈగా ఎస్ఆర్‌బీసీ సర్కిల్-2 అవుకు ఈఈగా పనిచేస్తున్న వెంకట సురేష్ బాబుకు బాధ్యతలు అప్పగించారు.

నింగి నుంచి రాలి.. నీటి ముత్యాలై నిలిచి !



చూసే కళ్లు.. స్పందించే హృదయం ఉంటే ప్రకృతిలో ప్రతిదీ ఓ అద్భుతంగా కనిపిస్తోంది. తుపాన్ ప్రభావంతో మంగళవారం కర్నూలు నగరంలో చిరు జల్లులు కురిశాయి. ఆ సమయంలో వాన చినుకులు విద్యుత్ తీగలపై నిలిచి నీటి ముత్యాలను తలపించాయి. తీక్షణంగా వాటిని చూస్తే ఎవరో నీటి బిందువులను తీగలపై పేర్చి పుడమికి ముత్యాల పందిరి వేసినట్లుగా అనిపించింది. దూరం నుంచి చూస్తే తళుక్కుమంటూ మెరిసి ఆకట్టుకున్నాయి. - సాక్షిఫొటో గ్రాఫర్, కర్నూలు

సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలి

నంద్యాల(న్యూటౌన్): ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిషిప్ చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న జిల్లా ఐటీఐ అభ్యర్థులు.. ఈనెల 11న కర్నూలు ఏపీఎస్ ఆర్టీసీ కార్యాలయంలో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాదరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీజిల్ మెకానిక్ విభాగానికి ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, మోటారు మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, డ్రాఫ్ట్‌మెన్ల విభాగానికి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందన్నారు. విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రాలు, పాన్, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, రేషన్‌కార్డు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, పాస్‌ఫొటోలతోపాటు రూ.118 ఫీజు తీసుకురావాలన్నారు.

మూడు ఇళ్లలో చోరీ

కర్నూలు (టౌన్): తాళాలు వేసి ఉన్న మూడు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. కర్నూలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. కర్నూలు కలెక్టరేట్ ఆఫీస్‌లో డ్యూటీ గార్డుగా పనిచేస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎస్.మహబూబ్ బాషా డోన్ హైవేలోని స్కంద హిల్స్‌లో ఉన్న తన ఇంటికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో తన ఇంటికి సమీపంలో మూడు ద్విచక్ర వాహనాల మీద ముగ్గురు యువకులను గమనించాడు. వారి వద్దకు వెళ్లి విచారించగా పెట్రోల్ కోసం వచ్చామని చెప్పారు. తర్వాత రెండు ద్విచక్ర వాహనాలను అక్కడే వదిలేసి ఒకే బైక్‌లో ఆ ముగ్గురు పారిపోయారు. ఏపీ 02 సీహెచ్ 3209, ఏపీ39 ఎస్6893 రెండు పల్సర్ వాహనాలను స్వాధీనం చేసుకున్న కానిస్టేబుల్ అనుమానం వచ్చి స్థానిక ఇళ్లను పరిశీలించారు. అప్పటికే మూడు ఇళ్ల తాళాలు తొలగించి ఉన్నాయి. ఇందులో కృష్ణమోహన్ అనే టీచర్ (ఇంటి నెం.బి-60), మిలిటరీలో పనిచేసే బలిజ సురేష్ (ఇంటి నెం.బి-61), మాజీ సైనిక ఉద్యోగి జి.ఎస్.రాజు (ఇంటి నెం.81)కు చెందిన గృహాలు ఉన్నాయి. వెంటనే ఆయా ఇళ్ల యజమానులతో పాటు కర్నూలు తాలూకా క్రైం పార్టీ పోలీసులకు ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సమాచారం అందించాడు. గత 15 రోజులుగా ఆ ఇళ్లకు తాళాలు వేసి ఉండటంతో దొంగలు గమనించి చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. బాధితులు వచ్చిన తర్వాత ఎంతమేర చోరీ జరిగిందనేది తెలుస్తోందని, ప్రస్తుతం తాము కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తాలూకా పోలీసులు తెలిపారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి



ప్లేస్‌మెంట్ వివరాలు పరిశీలిస్తున్న వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తున్నట్లు వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ పేర్కొన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్ కుమార్ నాయుడుతో కలసి ఆయన మంగళవారం వర్సిటీలోని కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ విభాగాన్ని సందర్శించారు. ప్లేస్‌మెంట్ సెల్ కార్యకలాపాలను వర్సిటీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జి.రామకృష్ణను అడిగి తెలుసుకున్నారు. 2023-24 సంవత్సరంలో కరూర్ వైశ్య బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎసాఫ్ బ్యాంక్, టాటా గ్రూప్, కెవిన్ కేర్, రైనెక్స్ టెక్నాలజీస్, క్యూస్పైడర్స్ మొదలైన 11 సంస్థల్లో 59 మంది వర్సిటీ విద్యార్థులు ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత 2024-25 విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు 3 సంస్థల్లో 23 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు డాక్టర్ రామకృష్ణ వీసీ, రిజిస్ట్రార్‌కు వివరించారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఉద్యోగావకాశాలు మెరుగుపరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని వీసీ ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరం మరిన్ని కంపెనీల ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ మరిన్ని ప్లేస్‌మెంట్ అవకాశాలు వచ్చేట్లుగా చూడాలన్నారు. ఇందుకోసం వర్సిటీ ప్లేస్‌మెంట్ విభాగాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు.

హాస్టళ్లలో మెనూ పాటించాలి

రాయలసీమ యూనివర్సిటీ హాస్టళ్లలో విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ ఆదేశించారు. మంగళవారం వీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో వర్సిటీకి అనుబంధంగా ఉన్న పురుషులు, మహిళల హాస్టల్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. హాస్టళ్లకు సంబంధించిన పలు అంశాలను ఆయన వారితో సమీక్షించారు. ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. హాస్టళ్లను పరిశుభ్రంగా ఉంచుతూ నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. సమావేశంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్‌కుమార్ నాయుడు, చీఫ్ వార్డెన్ ఆచార్య సి.విశ్వనాథ్ రెడ్డి, డిప్యూటీ వార్డెన్లు, ఇంజినీరింగ్ విభాగ సిబ్బంది, హాస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



ముగతి సర్కిల్ బోల్తా పడిన లారీ

నందవరం : మండల పరిధిలోని 167వ జాతీయ రహదారిలో ముగతి గ్రామ సర్కిల్‌లో సోమవారం అర్ధ రాత్రి లారీ బోల్తా పడింది. రాత్రిపూట ఈ ఘటన జరగడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు.. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ నుంచి పత్తి బెల్ లోడుతో లారీ మంత్రాలయం మీదుగా ఎమ్మిగనూరు వైపు వెళ్తుంది. నందవరం మండలంలోని ముగతి సర్కిల్‌లో డ్రైవర్ కట్టింగ్ చేయబోగా అదుపు తప్పి లారీ బోల్తా పడింది. అర్ధరాత్రి కావడం..స్థానికంగా జన సంచారం లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. డ్రైవర్, క్లీనర్‌కు కూడా ఎలాంటి గాయాలు కాలేదు.